కథానిక:

# నిట్టూర్పుగాడ్పులో నెత్తావి

శ్రీ వంగల వేణుగోపాలాచార్య

అప్పుడే తెల్లవారుతోంది. వాతావరణమంతా శాంతిగా, చల్లగా ఉంది. రామం నిద్దర మంచం మీద అల్లాగే పడుకొని తన చిట్టి తమ్ముడితో ఆడుకుంటున్నాడు. ఇంటిలోపలినుంచి కాఫీ వాసన ముక్కెక్కుతోంది దాంతో తమ్ముడిని దింపి, రామం లేచి గూపక్కట్టు సర్దుకుంటూ, దొడ్లోకి వెళ్ళేడు నోట్లో వేపపుల్ల పెట్టుకొని అల్లాగే కూర్చున్నాడు రామం. ఇంకా బద్ధకం సరిగ్గా వదల్లేదు ఒరే! కాఫీచల్లారి పోతోందోరి తల్లి వేసిన కేకతో, రామం యీలోకంపడి, దబదబా మొహం కడిగేసికొని, తుడుచుకుంటూ వంటింటిలోకి వచ్చాడు కాఫీసేవ అయ్యాక, డ్రస్సు వేసికొని వీధి అరుగుమీద కూర్చున్నాడు రామం

వీధిలో జనం యింకా మసలటం లేదు పొద్దున్నే వచ్చే పాకీవాళ్ళుమాత్రం వాళ్ళ పని వాళ్ళు చకచకా చేసికుపోతున్నారు. రామం, నిర్లిప్తంగా వీధి వంక చూస్తూ అల్లాగే కూర్చున్నాడు ఎదురింటి తెల్లగోడలు ఎండవల్ల ధగధగలాడుతున్నాయి ఇడ్లీల సుబ్బయ్య 'యిడ్లీ యిడ్లీలం'టూ అమ్ముకుపోతున్నాడు. కూరగాయలతట్టలవాళ్ళు ఒక్కొక్కళ్ళే వీధిలోకి దిగుతున్నారు చిట్టితమ్ముడు అరుగు కింద మట్టితో గూడుకడుతూ ఆడుతున్నాడు అందరూ ఏదో విధంగా పనుల్లో మగ్నులైయున్నారు. ఎవరికీ తీరిక లేదు మరి తనేం చెయ్యాలి? ఈ ప్రశ్న చాలసార్లు యిదివరకు వేసికున్నాడు రామం కాని, మామూలుగానే మెదడంతా, గాలించి సమధానందొరక్క, నిస్పృహగా యివతలికి వచ్చేసిందా ప్రశ్న 'ఏంచెయ్యను' మెల్లిగా గొణుక్కున్నాడు రామం

'ఉద్యోగం చెయ్యాలి,' 'ఎవరిస్తారు ఉద్యోగం', 'ఎక్కడికెళ్ళాలి,' 'ఎవరినాశ్రయించాలి,' తనెన్ని అప్లికేషన్లు పెట్టాడు. ఎన్ని యింటర్వ్యూలకి,' వెళ్ళాడు ఇంటర్వ్యూలు జ్ఞాపకమొచ్చేటప్పటికి రామం మొహంలో నిరాశాపూరితంగా చిన్న నవ్వు వెలసింది. ఇంటర్వ్యూలకి, నిజంగా ఒక పిచ్చివాడిలా తిరిగాడు రమ్మన్నచోటికి, వద్దన్నచోటికల్లా వెళ్ళాడు. ఎంతో డబ్బు వమ్ము చేశాడు. క్రొత్తలో. ఫలానా చోటికి యింటర్వ్యూకి వెళ్ళి వచ్చానని 'సగర్వంగా చెప్పుకొనేవాడు. రోజూ పోస్టుజవానుకోసం చూసేవాడు. అతడు తన యింటివైపు చూడకుండా వెడుతుంటే ఉస్సురనేవాడు రేపైనా తప్పకుండా వస్తుంది ఇవాళైనా పోస్టు చెయ్యరా అనుకుంటూ ఊహాగానంలో కాలంగడిపేవాడు. ఇప్పుడా యింటర్వ్యూల మీద కూడ నమ్మకం పోయింది.

'గిన్నె తెండి అమ్మగోరూ' అని పెరుగుది వేసిన కేకతో రామం ఉలిక్కిపడి, యీ యిహంలోకి పడ్డాడు చిట్టి తమ్ముడు మెల్లిగా పెరుగు గంపవద్దకి చేరాడు. తల్లి పెరుగు పోయించుకొని వెళ్ళడంతో. చిట్టి తన చిన్నచేయి జాపి, అందులో పడ్డ పెరుగు బిళ్ళవంక జూస్తూ, అరుగుకిందకి వెళ్ళాడు కొంచెం తట్ట ఎత్తండి, అబ్బాయిగారూ, అని పెరుగుది అంటే, రామం మెల్లిగా లేచి, తట్ట దాని నెత్తికెత్తి, మళ్ళీ అరుగు చివరకి వెళ్ళి, నుంచున్నాడు ఇంతలో పేపరు కుర్రాడు సైకిలు మీద పేపరు అందించి రివ్వున వెళ్ళిపోయాడు. రామం ఆతృతగా పేపరు విప్పి రెండో పేజీ దీక్షగా మొదల్నుంచి తుదిదాకా చూశాడు ఒక్క నిట్టూర్పువదిలాడు రామం. విసుగ్గా పేపరు యింట్లోకి విసిరి మెల్లిగా లైబ్రరీకి దారి తీశాడు. దారిలో సత్యం ఎదురుపడ్డాడు

'ఏరోయ్! యీ మధ్య దర్శనాలు లేవు' అన్నాడు సత్యం

'భలే! ఊళ్లోలేంది నువ్వేగా' అని రామం అంటే,

'అవునురా, వెధవ ఉద్యోగం యీ క్యాంపులో ఆయన పనులు, ఆఫీసు పనులు చూసేటప్పటికి తలప్రాణం కాళ్ళకొస్తోంది.

'ఆ' అంటే క్యాంపు. ఊ అంటే క్యాంపు. నీప నేనయం. రాజులా కాలుమీద కాలేసికొని.. ... అంటూ అల్లుకుపోతున్నాడు సత్యం. రామం వంచిన తలెత్తకుండా వస్తానురా, వేళయిందంటూ, మెల్లిగా లైబ్రరీ చేరాడు. అక్కడ రిటైర్డు తాసీల్దారు పురుషోత్తంగారు కనపడి ఏమోయ్, ఎక్కడైనా . . . అంటూంటే యింకా ఏంలేదండి వస్తానంటూ రామం గిరుక్కున వెనక్కు తిరిగి మళ్ళీ బజారులో పడ్డాడు. అంగడివీధంతా కిట కిట లాడుతోంది.

ఎవర్ని చూసినా, ఏదో పనితొందరలో ఉన్నట్టు, హడావిడిగా వెడుతున్నారు అందరి మొహాల్లోను, ఏదో వింతకాంతి ధైర్యం తొణికిసలాడుతున్నాయి. మరి యింత చదివిన తన గతి యిల్లా అయిందేం? ఎవరు కనబడ్డా 'మీ అబ్బాయి ఏంచేస్తున్నట్టు' అనడం, తండ్రి ఆ! ఉంటున్నాడు. చూస్తున్నాను ఏదైనా వీలుగా ఉంటే . . అని నసగడం, వాళ్ళు తనని అదో రకంగా చూడటము, తనని శూలాలతో కాల్చి పొడిచినట్టుగా ఉంది. తనకి యిరవైమూడేళ్ళు వచ్చాయి. ఎల్లాగో B A పూర్తిచేశాడు మొన్నటికి మొన్న తల్లి భోజనసమయంలో, 'వాళ్ళబ్బాయి కేదోపని అయిందిట నిన్న చూద్దామని వచ్చాడు యిందాకా! అని అంటూంటే ఆ మాటలు తన గుండెల్ని లాగేస్తున్నాయని ఆ యిల్లాలి కేం తెలుసు...అవును... అందరు ఏదోరకంగా ఉద్యోగాలు చేస్తున్నారు. మరి తనేం చెయ్యనన్నాడా. చివరికి గుమాస్తాగిరికికూడ సిద్ధమయ్యాడే.. తను పెద్దపెద్ద ఆశలకికూడ పోలేదే.. మరి ఎక్కడా దొరక్కపోతే తనేం చేసేదీ. 'చేతకానివాడవని' ఆత్మ ఘోషించింది.

పోనీ దేశాలు తెగించిపోతే...వెంటనే శాంతవిగ్రహం కళ్ళకట్టినట్టయింది. శాంతకి తనంటే ఎంత ప్రేమ! ఒక్క క్షణం తను

(25-వ పేజీ చూడుడు)

నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, విశ్వాక విస్ఫోటన శుక్లనష్టమును హరించి అపూర్వ కాంతిని వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

ఖరీదు రు. 3-4-0 పోస్టేజి 14 అ.

కె. వి. ఎ. క్లీ కంపెనీ.

కొరిటెపాడు—నెల్లూరు జిల్లా.

# నిట్టూర్పుగాడ్పులో నెత్తావి

(19 వ పేజీ తరువాయి)

కనపడకపోతే జేలయిపోయేది ఇంకా మామగారు ఉత్తరం రాయలేదేమి చెప్మా యింకా పురుడు రాలేదేమో, అనుకున్నాడు రామం. తనూ ఒక తండ్రి కాబోతున్నాడు. యీ భావం మొదట్లో మెదలగానే రామం మొహంలో ఒక వింత కాంతి గోచరించింది. కాని అది క్షణికం. తనూ తండ్రి అయినా యింకా తను తండ్రి నంటిపెట్టుకొని ఉండటమా ఇప్పుడే యిన్ని వాదులు ముందుముందు భరించగలనా రామంలోని ఆత్మాభిమానం ఒక్కసారి పెల్లుబికింది. తను సంపాదించాలి ఏదైనా ఉద్యోగం సంపాదిస్తే కాని శాంత మొహం తిరిగి చూడకూడదు.

మోటారుకారు హారన్ మోతతో, ఉలిక్కిపడి చూశాడు రామం 'అడ్డె కపడవలె ఎన్నయ్యా పైత్యమా' అంటూ ఆ అరవ డ్రైవరు కారు తిప్పుకొని దాటి వెళ్ళిపోయ్యాడు. రామం నిలబడి చుట్టూ చూశాడు రైల్వేస్టేషను హడావిడిగా కనపడుతోంది పక్కనే జట్కాలు, బస్సు వరుసలుదీర్చి ఉన్నాయి చేతి వాచీవంక చూసి ప్యాసింజరు టైము అయిందనుకున్నాడు రామం. ఇందులో వెళ్ళిపోతే. ఎక్కడికి... రైలు తిన్నగా మద్రాసులో దిగబెడుతుంది. జేబు తడుముకున్నాడు. కూడు రూపాయల చిల్లర రాలింది టిక్కెట్టుకయినా సరిపోదు ఏమయితే అయిందని ప్లాటుఫారంమీదికి వచ్చాడు అప్పటికే రైలు వచ్చేసింది అటూ యిటూ తిరుగుతున్నాడు రామం

'రామం!..రామం! రామం!......
ఎవరబ్బా తన్ని పిలుస్తున్నదని రామం వెనక్కి తిరిగి చూశాడు తన మామగారే! అరే! చాల హఠాత్తుగా వచ్చారే! దిగండి అంటూ కిటికీలోంచి ట్రంకు అందుకొని కింద పెడుతూ అటూ యిటూ చూశాడు. రైలు తలుపు పట్టుకుని నీరసంగా శాంత దిగుతోంది. రామం వెళ్ళి శాంతని జాగ్రత్తగా కిందకి దింపాడు. శాంత మొహం పాలిపోయింది. కళ్ళు తుకు దిగాయి. కంటికింద నలుపు యింకా నీరసస్థితిని సూచిస్తోంది. రామం ఒక్కసారి మామగారివైపు చూశాడు ఆయన మొహం తిప్పుకొని వచ్చే కన్నీటిని ఆపుకుంటూ గార్డు చూపేపచ్చ జెండా వైపు చూస్తున్నాడు. శాంతవైపు ఒకసారి చూశాడు. కాలి బొటన వేలు నేలకి రాస్తూ పమిటికొంగుతో మొహం కప్పుకొంది శాంత. రామానికేమీ పాలుపోవటములేదు. వచ్చిన పోర్టరుకి పెట్టి నెత్తికెత్తి ముగ్గురూ స్టేషను దాటారు. బండి మాట్లాడి శాంతని మెల్లిగా బండిలో ఎక్కించాడు రామం బండి మెల్లిగా సాగుతోంది. తన మొహం ఎవ్వరూ చూడలేక పోతున్నారు. ఇల్లు రాగానే తల్లి ఎదురొచ్చి యిన్ని మిరపకాయలు తిప్పి, శాంతని లోపలికి తీసికెళ్ళింది. చిట్టి తమ్ముడు అన్నయ్య మీదికి వచ్చాడు మామగారు పడక కుర్చీలో మేనువాల్చి, వాసాలవంక దీర్ఘంగా, గంభీరంగా చూస్తున్నారు.

తమ్ముడిని దింపి, వంటింటి గుమ్మంలోకి వెళ్లాడు రామం. శాంత అత్తగార్ని కావలించుకొని దుఃఖిస్తోంది. తల్లికూడ అలాగే ఉంది రామం వనుదిరిగి తనగదిలోకివచ్చాడు కిటికీ తలుపు తెరచి, తీక్ష్ణమైన ఎండచేత మెరుస్తోన్న మైదానం వంక చూస్తూ ఆలోచిస్తున్నాడు అంతలో యేదో తోచిందా తనికి బాధతో మొహం ముడుతలు పడినట్లు అయింది నిజంగా అంత పని జరిగి ఉంటుందా అనుకున్నాడు రామం ఏముంది, తన బిడ్డ లేదు. తల్లికి అపవాదులు తప్పించడానికే బిడ్డ పోయిందేమో అనుకున్నాడు రామం. [illegible] యెక్కడినుంచో దుఃఖం పొంగిపొరి వస్తోంది. ఆగటం లేదు. రెండు చేతులతో మొహాన్ని కప్పుకొని అల్లాగే కూలబడ్డాడు రామం.

భోజనాలయినాక శాంత వచ్చింది. వాడిన మొహం యింకా తేరుకోలేదు. రామం శాంతని దగ్గరికి తీసికుంటూ గద్గదికంగా పోనీ యింత జరిగితే ఒక్క జాబు వ్రాయించలేదే? ఎంత బాధపడ్డావో అని ఓదార్చాడు

ఇంతలో పోస్టుబంట్రోతు వచ్చి కేక వేశాడు బిక్కమొహంతో ఒకమూల కూరుచున్న చిట్టితమ్ముడు ఒక్క గంతులో గుమ్మంలోకి వచ్చి యిచ్చిన కవరందుకున్నాడు కొత్త దస్తూరీ చూసి ఎవరబ్బా అనుకుంటూ తన పేరనే వచ్చిన కవరు చింపి చూశాడు అది ఒక ప్రయివేటు కంపెనీ నుంచి వచ్చింది ఇదివరకు జరిగిన యింటర్వ్యూలలో తను సెలక్టయినట్టు, వారం రోజులలోగా వచ్చి మేనేజరుగా ఛార్జి పుచ్చుకోమని వ్రాశారు వేడిగా బరువుగా ఒక్క నిట్టూర్పు వదిలాడు రామం నీరసంగా. ఆ ఉత్తరం చూసిన రామానికి ఏడవాలో, నవ్వాలో తెలియటము లేదు.

ఒకచేత్తో ఆ ఉత్తరము పట్టుకొని, శూన్యంగా శాంతవైపు చూస్తూ అల్లాగే నిలబడిపోయాడు రామం

---


సర్వోత్కృష్టమైన
"కానన్ దేవన్"
టీ మాత్రమే త్రాగండి




ఏజంట్లు : కర్నూలు, అనంతపురం, కడప & చిత్తూరుజిల్లాలకు
కె. ఎ. జోషి, అనంతపురం.
టోకు వ్యాపారస్తులకు విశేష సౌలభ్యము
వివరములకు నేడే వ్రాయండి.